క్లుప్తంగా

అందరికీ అందుబాటులో ఇసుక

నెల్లూరు(సెంట్రల్): అందరికీ అందుబాటులో ఇసుక లభిస్తోందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉచిత ఇసుక విధానంపై తన కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.

గుర్రపుడెక్కను తొలగించాలని వినతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): పంట కాలువల్లో పెరిగిన గుర్రపుడెక్కను తొలగించాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు రామలింగాపురంలోని జలవనరుల శాఖ కార్యాలయంలో ఎస్‌ఈ దేశ్‌నాయక్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పెన్నా పరీవాహక ప్రాంతాల్లో ఫ్లడ్ బ్యాంకుల నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. నీలిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నెల్లూరు (టౌన్): ఇల్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషారాణి పేర్కొన్నారు. కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రతపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్‌బాబు, హెచ్‌ఎం భాస్కర్‌రావు, సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, జ్ఞానేంద్ర, మార్కేండేయ, బాలకోటి, మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు తరుణ్, సాయిబాబారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో దీపావళి వేడుకలు

నెల్లూరు (టౌన్): మాగుంట లేఅవుట్లోని విశ్వసాయి – ఎస్సార్కే స్కూల్లో దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. స్కూల్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురామ్ పాల్గొన్నారు.

- బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో బాణసంచాను విద్యార్థులు కాల్చారు. పాఠశాల చైర్మన్ ముజహర్, డైరెక్టర్ ఫహీమ్, ప్రిన్సిపల్ కిరణ్ పాల్గొన్నారు.

‘నారాయణ’లో రోబోటిక్స్

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో రోబోటిక్స్ 2కే 24ను మద్రాస్ ఐఐటీ, రోబోటిక్స్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ అశోకన్ హాజరయ్యారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సురేష్‌బాబు, కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, కన్వీనర్ శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గోపురోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నరకాసుర వధ కార్యక్రమాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామికి గోపురోత్సవం తదితర పూజా కార్యక్రమాలను వేడుకగా జరిపారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీబీ కార్యాలయంలో సమీక్ష

నెల్లూరు(అర్బన్): ఎలాంటి స్పర్శ లేకుండా రాగి, తేనె, నలుపు రంగులు కలిగిన పెద్దమచ్చలు శరీరంపై ఉంటే కుష్ఠు వ్యాధికి కారణమవుతాయని జిల్లా కుష్ఠు, టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని టీబీ కార్యాలయంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లతో నెలవారీ సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. డీఎస్‌ఎంఓ డాక్టర్ సురేంద్ర, టీహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. దివాలీ విత్ మై భారత్ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో బుధవారం నిర్వహించారు. స్వచ్ఛభారత్‌పై ర్యాలీని జరిపారు. అనంతరం పెద్దాస్పత్రి ఆవరణలోని చెత్తాచెదారాలను తొలగించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ సిద్ధానాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, నెహ్రూ యువకేంద్ర యూత్ ఆఫీసర్ మహేంద్ర, సెట్నెల్ సీఈఓ శ్రీనివాసులు, పీహెచ్‌పీ జిల్లా నేతలు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సన్మానం

నెల్లూరు (టౌన్): నగరంలోని కస్తూరిదేవి బాలికోన్నత పాఠశాలలో హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందనున్న వనజను బుధవారం సత్కరించారు. హెచ్‌ఎం కామేశ్వరి, ఎస్సెమ్సీ చైర్మన్ లక్ష్మీప్రసన్న, విశ్రాంత ఉపాధ్యాయులు శాంతిలక్ష్మి, స్వర్ణమ్మ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం


కవాతులో ర్యాలీలో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయమని ఏఎస్పీ సౌజన్య పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని పోలీస్ కవాతు మైదానం నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శనను ఏఎస్పీ, అధికారులు, సిబ్బంది బుధవారం నిర్వహించారు. నగర, రూరల్, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, దశరథరామారావు, శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ అంకమరావు పాల్గొన్నారు.

నారుమళ్లకు సాగునీరు విడుదల

నెల్లూరు (దర్గామిట్ట): ఐఏబీ సమావేశం జరగకపోవడం.. జిల్లాలోని రైతాంగం నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు సమయం మించిపోతున్న తరుణంలో సోమశిల నుంచి 2100 క్యూసెక్కులను కలెక్టర్ ఆదేశాల మేరకు విడుదల చేయనున్నామని ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాగునీటిని సద్వినియోగం చేసుకొని పంటలను పండించుకోవాలని కోరారు. జిల్లాలో 5.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ సీజన్లో నీరు అవసరం ఉందని పేర్కొన్నారు. పెన్నార్ డెల్టా కింద 2.47 లక్షల ఎకరాలు.. కనుపూరు కాలువ కింద 66 వేల ఎకరాలు.. కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు.. నార్త్ ఫీడర్ చానల్ కింద 72 వేల ఎకరాలు.. సౌత్ ఫీడర్ కెనాల్ కింద 42 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాల్సి ఉందని తెలిపారు.

- కనిగిరి, కనుపూరు, కావలి కాలువలకు బుధవారం నుంచి నవంబర్ 20 వరకు రోజూ 500 క్యూసెక్కులు.. సర్వేపల్లి కాలువకు నవంబర్ 20 వరకు 600 క్యూసెక్కులను విడుదల చేస్తామని చెప్పారు.
- జీకేఎస్ కాలువకు 500 క్యూసెక్కులను నవంబర్ 5 నుంచి 19 వరకు.. సౌత్‌ఫీడర్ చానల్‌కు 300 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయనున్నామని వివరించారు.
- కండలేరు నుంచి కేఆర్ లెఫ్ట్ కెనాల్‌కు 120.. మనుబోలు సిస్టమ్ ట్యాంక్ స్లూయిజ్ ద్వారా 200.. ఫస్ట్ బ్రాంచ్ కెనాల్‌కు 75 క్యూసెక్కులను విడుదల చేయనున్నామని వెల్లడించారు.
- ఎస్సెస్సీ కెనాల్స్ 2 ఏ, బీ, 3, 4, 5, 5ఏ, 6, 7, 8ఏ తదితరాలకు 950.. చెన్నై తాగునీటి అవసరాలకు 950.. తిరుపతి, శ్రీకాళహస్తి, ఏర్పేడుకు 100 క్యూసెక్కులను బుధవారం నుంచి వచ్చే నెల 13 వరకు విడుదల చేయనున్నామని ప్రకటించారు.

శ్రీనివాస్‌యాదవ్‌కు హైకోర్టులో ఊరట

నెల్లూరు(బారకాసు): కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. నగర పాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన మార్ట్‌గేజ్ విషయంలో ఫోర్జరీ జరిగిందని, ఇందులో ఈయన ప్రమేయం ఉందంటూ దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తనను అరెస్ట్ చేయొద్దంటూ హైకోర్టులో బెయిల్ పిటిషన్‌ను ఆయన దాఖలు చేశారు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి.. విచారణకు సహకరించాలని, ఆయనపై ఎలాంటి చర్యలు చేపట్టొద్దని ఆదేశాలు జారీ చేస్తూ కేసును నవంబర్ ఆరుకు వాయిదా వేశారు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి రూరల్ డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి డీఎస్పీని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం కలిశారు. హైకోర్టు ఆదేశాల మేరకు కేసు విచారణకు సహకరిస్తానని తెలిపారు. శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, రవిచంద్ర పాల్గొన్నారు.

గోల్డ్ స్కీమ్ పేరిట మోసంపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): గోల్డ్ స్కీమ్ పేరిట వ్యక్తిని మోసగించిన ఇద్దరిపై సంతపేట పోలీసులు చీటింగ్ కేసును నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ మోహన్‌రాజుకు మండపాలవీధిలో జ్యువెలరీ షాపు నిర్వాహకులు వెంకటసునీల్‌కుమార్ దంపతులతో పరిచయమైంది. గోల్డ్ స్కీమ్‌లో రూ.ఐదు వేలను మూడేళ్ల పాటు చెల్లిస్తే బంగారు వస్తువులను ఇస్తామని నమ్మించారు. దీంతో ఆయన రూ.1.8 లక్షలను కట్టారు. స్కీమ్ కాలపరిమితి తీరినా బంగారు ఆభరణాలను నిర్వాహకులు ఇవ్వలేదు. ప్రశ్నించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఎస్సై సుల్తాన్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వెంకటసునీల్‌కుమార్‌పై చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో చీటింగ్ కేసు ఇప్పటికే ఉందని సంతపేట పోలీసులు తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యురాలిగా ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): టీటీడీ బోర్డు సభ్యురాలిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలను ఆమె తెలియజేశారు.

‘ఆసస్’ స్టోర్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో ఆసస్ స్టోర్‌ను ఎస్వీ కంప్యూటర్స్, గాడ్జెట్స్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజినెస్ హెడ్ దీపక్ బొమ్మిశెట్టి మాట్లాడారు. బెంగళూరు, తిరుపతి, నెల్లూరులో 15కుపైగా స్టోర్లతో సేవలను విస్తరించడం ఆనందంగా ఉందని చెప్పారు. అద్భుతమైన ఆఫర్లతో ఆన్‌లైన్ కంటే తక్కువ ధరలతో అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు.

ఐటీఐ ప్రిన్సిపల్‌కు సన్మానం



నెల్లూరు (టౌన్): ఉద్యోగ విరమణ పొందనున్న ఐటీఐ ప్రిన్సిపల్ రజియాను నగరంలోని పినాకినీ కన్వెన్షన్ హాల్లో బుధవారం సత్కరించారు. ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ సుధాకర్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు అనిల్‌బాబు, జగదీష్, పాండ్య, ఉపాధి, శిక్షణ శాఖ ఏడీ సాల్మన్, వి.శ్రాంత ఆర్జేడీ ప్రసాద్, ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

నెల్లూరు(క్రైమ్): దీపావళి నేపథ్యంలో జిల్లాలోని పలువురు అగ్నిమాపక సిబ్బందిపై అవినీతి ఆరోపణలొచ్చాయి. విషయం ఆ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ దృష్టికి వెళ్లడంతో విచారణ జరిపి నివేదికను అందజేయాలని గుంటూరు రీజినల్ ఫైర్ ఆఫీసర్ జిలానీని ఆదేశించారు. దీంతో జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయానికి బుధవారం ఆయన చేరుకున్నారు. పలువురు బాణసంచా దుకాణదారులు, గోదాముల నిర్వాహకులును కార్యాలయానికి పిలిచి విచారణ జరిపి వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారని తెలిసింది. అనంతరం వీఆర్సీ, వైఎమ్సీఏ మైదానాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు. కొందరు దుకాణదారులను సైతం ఆర్‌ఎఫ్‌ఓ విచారించనున్నారని సమాచారం.

2న డీఆర్సీ సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా రివ్యూ కమిటీ సమావేశాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నామని కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదలకూరు రోడ్డులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని చెప్పారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కోరారు.

త్వరలో ఎన్సీఈఆర్టీ తరగతులు ప్రారంభం



నెల్లూరు (టౌన్): నగరంలో ఎన్సీఈఆర్టీ సంస్థ కార్యకలాపాలను నవంబర్ తొలి వారంలో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి వీఆర్ కళాశాలలో ఏర్పాట్లను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ సంస్థ అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే రూ.60 లక్షలతో వీఆర్ కళాశాలలో ల్యాబ్‌లు, కంప్యూటర్ పరికరాలు తదితరాలతో తరగతి గదులను సుందరంగా తీర్చిదిద్దారు. వాస్తవానికి ఎన్సీఈఆర్టీ సంస్థ కార్యకలాపాలను వెంకటాచలం మండలం చవటపాళెంలో నిర్వహించాల్సి ఉంది. అయితే అక్కడ భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వీఆర్ కళాశాలలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇక్కడ 27 తరగతి గదులను బోధనకు అనుకూలంగా తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలకు సంబంధించిన తరగతులు, పరిశోధనలు, శిక్షణ తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామని పలువుర్ని మోసగించిన వ్యక్తిపై సంతపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. వివరాలు.. రంగనాయకులపేటకు చెందిన నజ్మా ఉన్నత విద్యను అభ్యసించారు. అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ షోయబ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో కస్టమర్ అసోసియేట్‌గా పనిచేస్తున్నారు. తాను పనిచేస్తున్న కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తానని నజ్మా వద్ద విడతలవారీగా రూ.70 వేలు, ఆమె స్నేహితులైన లీలా మహేష్ వద్ద రూ.53 వేలు, గుణశేఖర్ వద్ద రూ.17 వేలు, అబ్దుల్ హక్ వద్ద రూ.23 వేలు, లక్ష్మీనారాయణ వద్ద రూ.11 వేలు మొత్తంగా రూ.1.74 లక్షలను తీసుకొని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చాడు. వీటిని కంపెనీ ప్రతినిధులకు బాధితులు చూపగా, నకిలీవని తేలింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు అతడ్ని నిలదీశారు. తాము ఇచ్చిన నగదును ఇవ్వాలని వారు అబ్దుల్‌ను కోరగా, కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ మేరకు బాధితురాలు తన స్నేహితులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘దీపం’ ప్రారంభం రేపు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులో స్థానిక కార్యక్రమాల్లో గురువారం పాల్గొననున్నారు. ఆత్మకూరులో శుక్రవారం నిర్వహించనున్న దీపం పథకం – 2 ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన హాజరుకానున్నారు.

దీపావళిని సుఖసంతోషాలతో జరుపుకోవాలి

నెల్లూరు(బారకాసు): దీపావళిని ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని పలువురు కాంక్షించారు. ఈ మేరకు మాజీ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి వేర్వేరు ప్రకటనల్లో దీపావళి శుభాకాంక్షలను బుధవారం తెలియజేశారు.

నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు(సెంట్రల్): ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ తెలియజేశారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ఏర్పాటు

నెల్లూరు(బృందావనం): సమాజ సేవలో సంఘాలు భాగస్వాములై పేదల ఉన్నతికి తోడ్పడాలని సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్ పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో బుధవారం నిర్వహించిన పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. అనంతరం కార్యవర్గాన్ని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు బెన్హర్‌బాబు ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా జాషువా, కోశాధికారిగా ఎనోష్, ఉపాధ్యక్షులుగా రాజు, సదాశివరావు, కార్యదర్శిగా కిషోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సునీల్‌గవాస్కర్, సహాయ కార్యదర్శులుగా శ్యామ్, సుధీర్‌బాబు, ఆత్మామేనస్, కార్యవర్గ సభ్యులుగా శశి, సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ జాతీయ సమన్వయకర్త జయప్రకాష్, పాస్టర్లు క్రాంతి, ప్రభు, పాల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో గల రైతు సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రైతులకు రూ.20 వేలను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని చెప్పినా, నేటికీ వేయలేదని ఆరోపించారు. అప్పుల బాధలు తాళలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులకు చేసిందేమీలేదని దుయ్యబట్టారు. రైతు సమస్యలపై నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నామని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు షానవాజ్, నేతలు వెంకటసుబ్బయ్య, పముజుల వెంకటేశ్వర్లు, మున్నా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వస్త్రాల అందజేత

నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో దివ్యాంగులు, మహిళలు, వృద్ధులకు వస్త్రాల పంపిణీతో పాటు అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ సౌత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, మల్లికాబేగం, పూర్వ రోటరీ గవర్నర్ వొమ్మిన నాగసతీష్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి, సతీష్, నరసింహరావు, సుధాకర్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను డిజిటల్ రూపంలో చెల్లించే విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. బిల్లులను ఫోన్ ద్వారా ఎలా చెల్లించాలనే అంశాన్ని జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, టిడ్కో గృహ సముదాయాల్లోని వినియోగదారులకు తెలియజేశారు. ఎస్‌ఈ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దీపావళి సందర్భంగా గురువారం సెలవైనా విద్యుత్ బిల్లులను యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎల్ఐసీని కాపాడుకునేందుకు పోరాటం

నెల్లూరు(అర్బన్): ఏజెంట్ల హక్కులతో పాటు ఎల్ఐసీని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నామని ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. జేమ్స్‌గార్డెన్‌లో ఏజెంట్లతో సమావేశాన్ని ఎల్ఐసీ ఏవోఐ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సంఘ నెల్లూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి నరసింహరావు, అధ్యక్షుడు శివయ్య, మేకల నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ‘ఈశా’ గ్రామోత్సవాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా వ్యాప్తంగా నృత్యాలు, క్రీడలు, సంగీతం, కళలు తదితర కార్యక్రమాలతో గ్రామోత్సవాలను నవంబర్ 16, 17న ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి బ్రహ్మానాయుడు పేర్కొన్నారు. నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. 21 ఏళ్లు నిండిన యువత పాల్గొనవచ్చని చెప్పారు. ఆసక్తి గల తమ పేర్లను నవంబర్ పదిలోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ వలంటీర్లు గణేష్, ఆయేషా, మాధవ్, మహేష్ పాల్గొన్నారు.

గౌసే ఆజం గ్యార్వీ షరీఫ్ నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని చిన్నబజార్‌లో అలీ షాన్ షహరే నెల్లూరు ఇజ్తేమా గౌసే ఆజం గ్యార్వీ షరీఫ్‌ను గురువారం సాయంత్రం నుంచి నిర్వహించనున్నామని బాబా సాహెబ్ బంధానవాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాలకు చెందిన షాహి ఉల్మా, మౌలానా హబీబ్ బాషా ఖాదిరి ఉపన్యసించనున్నారని చెప్పారు.

అలరించిన సంగీత విభావరి

నెల్లూరు(బృందావనం): కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సుబేదారుపేటలోని మేరీ రాణి వీధిలో సంగీత విభావరిని ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గాయకులు ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం గాయని జ్యోతిప్రియను సత్కరించారు. నాగినేని ప్రభాకర్, నాగరాజు, షఫీ, కృష్ణయ్య, అమానుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమంచర్లలో ‘పొలం పిలుస్తోంది’

నెల్లూరు సిటీ: ఆమంచర్ల, సౌత్‌మోపూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి నాగమోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు శివకుమార్, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.